అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి



కమిషనర్ కర్ణన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: డివిజన్‌లో సీసీరోడ్ల అభివృద్ధి పనులకు రూ.5 కోట్లు మంజూరు చేయాలని మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు. మీర్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, సాయిజెనోఖర్ తదితరులున్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించండి

కుషాయిగూడ: జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిశారు. చర్లపల్లి డివిజన్ పరిధిలో ముంపునకు గురౌతున్న సాయినగర్, కృష్ణారెడ్డినగర్ కాలనీల సమస్యను కమిషనర్‌కు వివరించారు. అదనంగా 550 మీటర్ల స్టామ్ వాటర్‌లేన్ నిర్మాణం చేపడితే ఆ రెండు కాలనీల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్, ఎల్‌బీనగర్ జెడ్సీసీతో మాట్లాడి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, నేమూరి మహేష్‌గౌడ్ తదితరులున్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

మల్కాజిగిరి: డివిజన్‌లో పెండింగ్ పనులపై దృష్టి సారించాలని కార్పొరేటర్ శ్రవణ్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు విజ్ఞప్తి చేశారు. ఎస్పీనగర్‌లో వరద నీటిని అరికట్టడానికి గ్రేటింగ్ మంజూరు చేయాలని, శ్మశానవాటిక అభివృద్ధి పనులు, 'గ్యాస్ క్రిమేషన్ మిషన్', సఫిల్‌గూడ చెరువులో గుర్రపుడెక్క తొలగింపు, టాయిలెట్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరానన్నారు.

కార్పొరేటర్ పర్యటన

అల్వాల్: డివిజన్ మాధవినగర్‌లో నెలకొన్న సమస్యలపై కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. కాలనీల్లో వరదనీటికి అవుట్‌లెట్ లేక ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన ఆమె సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. డీఈ ప్రశాంతి, జలమండలి అధికారి కృష్ణమాచార్యులు, శేఖర్, కాలనీవాసులు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పీహెచ్‌సీ'లో ఆయుర్వేద దినోత్సవం



అల్వాల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ధన్వంతరి జయంతి సందర్భంగా డాక్టర్ శైలజ ఆధ్వర్యంలో ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. మహిళలకు బీపీ, షుగర్, కేన్సర్ తదితర పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స, మందులు పంపిణీ చేశారు. డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్లు అనఘ, సుప్రియ, అనూష, వైద్య సిబ్బందితో పాటు సురేందర్‌రెడ్డి, వర్మ తదితరులున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్, అశోక్‌నగర్ కాలనీలో రూ.16 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ పనులకు మంగళవారం కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. జలమండలి డీజీఎం సతీష్, మేనేజర్ సిరాజుద్దీన్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాస్

అల్వాల్: మల్కాజిగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి నేరేడ్‌మెట్ ఎస్సై శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దన్నారు. విద్యార్థులు సరదా పేరుతో ర్యాగింగ్‌కు పాల్పడొద్దన్నారు. ర్యాగింగ్ చేసిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మల్కాజిగిరిలో..



మారుతీనగర్‌లో అన్నపూర్ణగా..



ఉత్తమ్‌నగర్ శ్రీదుర్గా జ్యోతిష్యాలయంలో



బాల త్రిపుర సుందరి అలంకరణలో..



వాణినగర్ విజయవినాయక ఆలయంలో..



మరకత లక్ష్మీగణపతి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

గాయత్రి దేవి నమోస్తుతే !

ఉప్పల్, మల్కాజిగిరి జోన్ పరిధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం రెండో రోజున అమ్మవారు గాయత్రిదేవి, వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పలు చోట్ల మహిళలు సామూహిక కుంకుమార్చన, సౌందర్య లహరి పారాయణం చేశారు. ఆదిశక్తి స్వరూపమైన అమ్మవారిని భక్తితో సేవిస్తే సకల శుభాలు కలుగుతాయని అర్చకులు భక్తులకు వివరించారు.

– ఉప్పల్, మల్కాజిగిరి జోన్ బృందం



ఉప్పల్ మహంకాళి ఆలయంలో కార్పొరేటర్ రజిత



సిద్ధి వినాయక ఆలయంలో సామూహిక ఆరాధన



జ్ఞానసరస్వతి ఆలయంలో సామూహిక కుంకుమార్చన



దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



కంటోన్మెంట్ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: వెంకటాపురం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మంగళవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్‌నాయక్, బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుక నర్మద మల్లికార్జున్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లోతట్టు ప్రాంతాలైన కమలాలయకాలనీ, ఆర్టీసీ కాలనీ, బోరహా కమ్యూనిటీ ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జాయింట్ సీఈఓ ఆశిక్‌హుస్సేన్, చీఫ్ ఇంజినీర్ ఉమాశంకర్, అసిస్టెంట్ ఇంజినీర్ రాజేశ్వర్, దినేష్, జలమండలి జీఎం సునీల్, డీజీఎం సాంబయ్య, మేనేజర్ రమేష్, బీఆర్‌ఎస్ నేతలు అనిల్‌కిషోర్‌గౌడ్, అరుణ్, కాలనీవాసులు అశోక్, వినోద్, రాజ్‌కుమార్, సూర్జీత్‌సింగ్, హకీమ్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ ధనుంజయ

మల్లాపూర్: అపరిచిత వ్యక్తులు ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పమని అడిగితే చెప్పకూడదని నాచారం ఇన్‌స్పెక్టర్ కె.ధనుంజయ సూచించారు. మంగళవారం మల్లాపూర్‌లోని మైప్లవర్ గ్రాండ్ అపార్ట్‌మెంట్‌వాసులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ఫోన్ వచ్చే కొన్ని యాప్‌లు, అప్లికేషన్లు డౌన్‌లోడ్ చేసుకోకూడదన్నారు. మోసపోతే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఎస్సై వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వరద సమస్య పరిష్కారానికి కృషి

కాప్రా: ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలతో కాప్రా డివిజన్‌లోని పలు కాలనీల్లో రోడ్లు జలమయమయ్యాయి. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్‌శివమణి పలు విభాగాల సిబ్బందితో కలిసి పరిశీలించారు. రోడ్లపై నిలిచిన వరదనీటిని తక్షణమే తొలగించేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. శాశ్వత పరిష్కారానికి వినాయక్‌నగర్ ప్రాంతంలో బాక్స్ డ్రెయిన్ ఏర్పాటుకు కృషి చేస్తానని స్థానికులకు ఆయన హామీ ఇచ్చారు.



వరద నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్

మినీ శిల్పారామంలో బతుకమ్మ సందడి





మల్లాపూర్‌లో బతుకమ్మ వద్ద మహిళల సందడి

ఉప్పల్: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉప్పల్ మినీ శిల్పారామంలో మంగళవారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బతుకమ్మను పేర్చి తీసుకొచ్చి ఆటపాటలతో అలరించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శివానిప్రియా భాగవతుల శిష్యబృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. పండుగ సందర్భంగా శిల్పారామంలో ఏర్పాటు చేసిన సారీస్ అఫ్ ఇండియా మేళలో చీరలు, చేనేత వస్తువులు, దుస్తులు ఆకట్టుకున్నాయి.

తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి..

మల్లాపూర్: నాచారం, మల్లాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. మల్లాపూర్ నెహ్రూనగర్‌లో మహిళలు కలిసికట్టుగా ఆడిపాడారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

గౌతంనగర్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించినప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా జీవిస్తారని కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ అన్నారు. 'స్వస్త్ నారీ – స్వశక్తి పరివార్ అభియాన్' పేరుతో మల్లికార్జుననగర్‌లోని ఏకలవ్యనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మహిళలకు రెండ్రోజులపాటు ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి కార్పొరేటర్ సునీతారాముయాదవ్ హాజరై ఆరోగ్య పరిస్థితులను డాక్టర్ రాధాను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలకు మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, కేన్సర్, విటమిన్ బి–125, విటమిన్ డి పరీక్షలతో పాటు చెవి, ముక్కు, చర్మ, దంత, గొంతు, మానసిక రుగ్మతలు ఓరల్ సర్వే, నెలసరి పరీక్షలు, సంతాన సమస్యలపై ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. ఆశావర్కర్లు, పట్టణ ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది, స్టాఫ్ నర్సులు, బీఆర్‌ఎస్ నేతలు మేకల రాముయాదవ్ పాల్గొన్నారు.



ఏకలవ్యనగర్‌లో కార్పొరేటర్ సునీత

ఊరెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ

అల్వాల్: బంధువుల వివాహానికి తిరుపతికి వెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శివానగర్‌లో నివసించే ఆనంద్‌బాబు ట్యాక్స్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 17న తిరుపతిలోని బంధువుల వివాహానికి కుటుంబసమేతంగా వెళ్లారు. కాగా మంగళవారం ఇంటితాళం పగులగొట్టి ఉండటాన్ని స్థానికులు గమనించి అతడికి సమాచారం ఇవ్వగా.. హుటాహుటిన అల్వాల్‌కు తిరిగొచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు విచారణ నిమిత్తం వివరాలు సేకరించగా.. ఇంట్లోని 8 తులాల బంగారం, నగదు, 35 తులాల వెండి వస్తువులు దొంగతనానికి గురైనట్లు బాధితుడు వాపోయాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడికి గాయాలు

పరిస్థితి విషమం

కుషాయిగూడ: విద్యుదాఘాతంతో ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడిన ఘటన చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన సచిన్‌రామ్ (29) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి బాలాజీనగర్‌లో బంధువులతో కలిసి ఉంటున్నాడు. గత ఆదివారం లేబర్ కాంట్రాక్టర్ శంకర్ అనే వ్యక్తి సచిన్‌రామ్‌ను కూలీ పనికోసం తీసుకెళ్లాడు. చర్లపల్లి పారిశ్రామికవాడలోని విద్యుత్ స్తంభానికి రంగులు వేసే పనిని అతడికి అప్పగించాడు. ఈ క్రమంలో చర్లపల్లి ఐడీఏ ఫేజ్–2లో రెండు ట్రాన్స్‌ఫార్మర్ల మధ్య ఉన్న కరెంటు స్తంభానికి రంగులు వేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. 11కేవీ తీగలు కావడంతో అతడి శరీర భాగాలు కాలిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

యువతి అదృశ్యం

కుషాయిగూడ: పండుగకు ఊరెళ్తున్న క్రమంలో ఓ యువతి కనిపించకుండా పోయిన ఘటన చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన తపస్వని బెహర (19)బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి కుటుంబసభ్యులతో కలిసి ఇబ్రహీంపట్నం, ఇంజాపూర్‌లో ఉంటోంది. ఈనెల 22న కుటుంబసభ్యులతో కలిసి దసరాకు సొంతురూ వెళ్లేందుకు బయలుదేరింది. ఈ క్రమంలో చర్లపల్లి రైల్వేస్టేషన్ వద్ద ఆటో దిగి స్టేషన్‌లోకి వెళ్తున్న క్రమంలో యువతి కనిపించకుండా పోయింది. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో కుటుంబసభ్యులు చర్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మల్కాజిగిరి మీదుగా 'వందేభారత్' నడపాలి

గౌతంనగర్: సౌత్ సెంట్రల్ రైల్వేకు మరో రెండు వందేభారత్ రైళ్లు మంజూరు చేయడం హర్షనీయమని, ఆ రైళ్లను చర్లపల్లి నుంచి కాకుండా మల్కాజిగిరి రైల్వేస్టేషన్ నుంచి నడపాలని ప్రయాణికుల సంఘం సభ్యులు ఓ ప్రకటన ద్వారా తెలిపారు. అమృత్ భారత్‌లో భాగంగా మల్కాజిగిరి రైల్వేస్టేషన్ ఎంతో అభివృద్ధి చెందిందని, మల్కాజిగిరి నుంచి వందేభారత్ రైల్‌ను నడపాలని కోరారు.

ముంపు ప్రాంతాల పరిశీలన



నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, డీసీ జకియాసుల్తానా



కూలిన నాలా ప్రహరీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలో ముంపు సమస్య ఎదుర్కొంటున్న కాలనీలను సోమవారం రాత్రి కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ , సర్కిల్ డీసీ జకియా సుల్తానా, ఈఈ లక్ష్మణ్‌తో కలిసి పర్యటించారు. లోతట్టు ప్రాంతాలైన సత్తిరెడ్డి నగర్, సత్యరాఘవేంద్ర కాలనీ, దుర్గానగర్ ప్రాంతాలు ముంపునకు గురికాకుండా పూడికతీత పనులు చేపట్టాలన్నారు. డీసిల్టింగ్ వర్షాకాలంలో కాకుండా ముందుగానే బాక్స్ డ్రెయిన్లలో పూడిక తీస్తే ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. డీఈ లౌక్య, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

కుషాయిగూడ: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న ముంపు ప్రాంతాల్లో మంగళవారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పర్యటించారు. డివిజన్ పరిధిలోని శివసాయినగర్, సోనియాగాంధీనగర్, గాంధీనగర్, మారుతీకాలనీల్లో ఆమె పర్యటించారు. వరద కారణంగా దెబ్బతిన్న రోడ్లు, కాలనీల్లోని వీధులను ఆమె పరిశీలించారు. నాలా ప్రవాహ ఉధృతికి శుభోదయకాలనీ వద్ద ప్రహరీ కూలి వరదనీరు ఇళ్లలోకి వస్తుందని స్థానికులు వాపోయారు. కూలిన ప్రహరీని పరిశీలించిన ఆమె ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి తక్షణమే ప్రహరీ నిర్మాణం చేపట్టాలని కోరారు. డీఈ బాలకృష్ణ, ఏఈ అభిషేక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి తదితరులున్నారు.

పండుగకు బస్సు ఛార్జీల పెంపును విరమించుకోవాలి



డీఎంకు వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీ నేతలు

బోడుప్పల్: దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ 50 శాతం ఛార్జీలను పెంచాలని చేసిన ప్రతిపాదనను విరమించుకోవాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఉప్పల్‌శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉప్పల్ డిపో, చెంగిచర్ల డిపో మేనేజర్లకు వినతిపత్రం అందజేశారు. దసరా పండుగకు ఛార్జీలు పెంచడం సరికాదని ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. ఈ పండుగకు పల్లె ప్రాంతాలకు వెళ్లే ప్రజలు ఎక్కువగా ఉంటారని, వారిపై భారం పడుతుందని వినతిపత్రంలో కోరారు. సానుకూలంగా స్పందించిన డీఎంలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. విశ్వహిందూ పరిషత్ ఉప్పల్‌శాఖ అధ్యక్షుడు ఎంఎన్ రమేష్‌నాయుడు, కార్యదర్శి రమేష్‌రెడ్డి విభాగ్ సహకార్యదర్శి రాఘవేంద్రరావు, సునీల్‌నాయక్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



మల్లాపూర్: సంత్ గురు రవిదాస్ భక్తి ఉద్యమం సదస్సు పోస్టర్‌ను మంగళవారం నాచారం అంబేడ్కర్ విగ్రహం వద్ద బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లారాధాకృష్ణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. 27న ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో నిర్వహించే సదస్సుకు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని సూచించారు. సంత్ రవిదాస్ ధార్మిక సంఘటన రాష్ట్ర కో– ఆర్డినేటర్ ప్రమోద్‌కుమార్, హెచ్‌ఆర్.మోహన్, గొడెల్లి సావిత్రి, ఏర్పుల నాగరాజు, సదానందం, గౌడ సుదర్శన్, గణేష్‌గౌడ్, యాకస్వామి, వెంకటేష్, విజయ్‌కుమార్, రాజశేఖర్, రామకృష్ణారెడ్డి, మల్లేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత స్థానాలకు ఎదగొచ్చు

డాక్టర్ ప్రొఫెసర్ గోపాల్‌నాయక్



విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేస్తున్న ప్రొఫెసర్ గోపాల్‌నాయక్

రామంతాపూర్: విద్యార్థి దశలోనే క్రమశిక్షణను పాటిస్తూ.. కృషిచేస్తే ఎంతటి ఉన్నత స్థానానికైనా సులువుగా చేరుకోవచ్చని ఉస్మానియా యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.గోపాల్‌నాయక్ అన్నారు. మంగళవారం రామంతాపూర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2022–25 బ్యాచ్‌కు చెందిన డిప్లొమా చేసిన 426 మంది విద్యార్థులకు ప్రొఫెసర్ గోపాల్‌నాయక్ పట్టాలను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాము చదువుకునేటప్పుడు ఆధునిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలు లేవని, ప్రస్తుతం ఏ విషయంలోనైనా సులభంగా నేర్చుకోవడానికి అవసరమయ్యే పరికరాలు వచ్చాయన్నారు. వాటిని ఆసరగా చేసుకుని విద్యార్థులు మంచి నిపుణులుగా తయారుకావాలని సూచించారు. ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్, అధ్యాపకులు మల్లికార్జున్, రమణ, ప్రసాద్, సూర్యకుమారి, వినోద్‌కుమార్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.